వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకొస్తున్న భూహక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా చేసుకుని అధికార వైసీపీపై ముప్పేట దాడి చేశారు. ప్రజాసంఘాలు, కులసంఘాలు, మేథావులు, విద్యావంతులు ముక్తకంఠంతో ల్యాండ్ టైటిల్ యాక్టును వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా న్యాయవాదులు నాలుగు నెలలుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఆ చట్టం అమలులోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజల భూములకు రక్షణ లేకుండా పోతుందని ముక్తకంఠంతో చెబుతున్నారు. వీరి ఆందోళనలు, అపోహలు ఎలా ఉన్నా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలంలో ఎప్పటి నుంచో ఈ యాక్టు అమలులో ఉంది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి దీనిని అమలు చేస్తున్నారు.

భూమి ఒకరిది.. హక్కులు మరొకరివి..



- కురబలకోటలో ఎప్పటి నుంచో భూహక్కు చట్టం అమలు
- లబోదిబోమంటున్న బాధితులు
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- మీ భూములు మీవేనా? చూసుకోండి!



హార్సిలీహిల్స్‌కు దిగువభాగంలో రికార్డులు మారిన కురబలకోట రెవెన్యూ గ్రామంలోని డీకేటీ భూములు



ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టము, 2022
(The Andhra Pradesh Land Titling Act, 2022)



మదనపల్లె, మే 19: జిల్లాలోని మదనపల్లె తర్వాత సమీపంలోని కురబలకోట మండలంలో భూముల ధరలు పోటీపడుతున్నాయి. కురబలకోట మండలంలోని అంగళ్లు మీదుగా అటు కడప-బెంగళూరు, ఇటు అనంతపురం-చెన్నై ప్రధాన రహదారులు వెళ్తున్నాయి. పైగా మదనపల్లె పట్టణానికి కలసిపోయి ఉండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయని చెప్పవచ్చు. అందుకే మదనపల్లె పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి మొదలై అంగళ్లు కేంద్రంగా వైసీపీ నేతల భూకబ్జాలు పెచ్చుమీరిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, డీకేటీ భూములే కాదు ప్రైవేటు భూములపై కన్నేశారు. అప్పటికే అన్నదమ్ములు, దాయాదుల మధ్య వివాదాలు నడుస్తుంటే అగ్రిమెంట్లతో కొనుగోలుకు ఎంట్రీ అవుతున్నారు. లేదంటే వివాదాలు సృష్టించి ప్రవేశిస్తున్నారు. ఏదైతేనేం అధికార బలంతో అటు రెవెన్యూ అధికారులు, ఇటు పోలీసులను పావులుగా వాడుకుని భూములను ఆక్రమిస్తున్నారు. అవి ప్రభుత్వానివా? ప్రైవేటువా? అనే దానితో సంబంధం లేకుండా పని కానిచ్చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జాతీయ రహదారుల వెంట ఉన్న విలువైన ప్రభుత్వ గ్రామ కంఠం భూములను ఇంటి ప్లాట్ల కింద అమ్మేసి నిర్మాణాలు చేపడుతున్నారు. జగనన్న ఇళ్ల పేరుతో అసైన్‌మెంటు భూములను స్వాధీనం చేసుకున్నారు. వాటి చుట్టూ ఉన్న పేద, మధ్యతరగతి రైతుల అసైన్డ్ పట్టా భూములను జగనన్న అస్త్రంతో తక్కువ ధరకు కొనుగోలు చేశారు. వాటిలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు.

భూహక్కు చట్టాన్ని ముఖ్యంగా ఇక్కడ వైసీపీ నేతలు స్థానికంగా లేని, ఉద్యోగరీత్యా బయటి ప్రాంతాల్లో నివాసముంటున్న వారి భూములపై ప్రయోగిస్తున్నారు. మీ హక్కులు, బుక్కులతో మాకేంటి పని అంటూ రికార్డులు మార్చేస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో వన్‌బీలు మార్చేసి హక్కులు పొందుతున్నారు. ఇందులో కొందరు అదే భూములను అమ్మకానికి కూడా పెడుతున్నట్లు చెబుతున్నారు. ఇలా ఒకరి భూమిని మరొకరి పేరున రికార్డులు మార్చడంలో అమాయకులు బలవుతుండగా, వైసీపీ నాయకులు, మధ్యవర్తులు, రెవెన్యూ అధికారులు లబ్ధి పొందుతున్నారు. ఇలాంటి భూ మార్పిడిలో ఒక కురబలకోట మండలంలోనే రూ.కోట్ల చేతులు మారాయంటే అతిశయోక్తి కాదు. మరీ ముఖ్యంగా ఇదివరకే ఎస్సీ, ఎస్టీ, ఇతరులకు ప్రభుత్వం పట్టాలు జారీ చేసింది. అయితే తర్వాత వివిధ కారణాలతో ప్రజాప్రయోజనాల కోసం స్వాధీనం చేసుకుని రిజర్వులో పెట్టింది. వాటిని కూడా వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులను నయానో, భయానో తన దారికి తెచ్చుకుని పట్టాలు చేయించుకున్నారు. చివరకు అటవీ భూములను కూడా వదలడం లేదు.

మీ భూములు మీవేనా? చేసుకోండి

కురబలకోట మండలంలో ల్యాండ్ టైటిల్‌యాక్టు అమలులోకి రాకముందే ఎందరివో భూమి హక్కులు మారిపోయాయి. ఒకరి పేరున ఉన్న భూమిని మరొకరి పేరున మార్చేశారు. ఆన్‌లైన్ రికార్డులూ మారిపోయాయి. వివిధ పనుల మీద రికార్డులకు వెళ్లినప్పుడే వెలుగులోకి వస్తున్నాయి. మా భూమే మాదే కదా? ఇతరులకు ఎలా అవుతుంది? మా రికార్డులు మా ఇంట్లోనే బీరువాలోనో లేక బ్యాంకులో భద్రంగా ఉన్నాయి అనుకుంటే పొరపాటే. మీరు రికార్డులో కాలేసినట్లే. అవసరం ఉన్నా..లేకున్నా..ఒకసారి ఆన్‌లైన్ రికార్డులు చెక్ చేసుకోవాలని, తమ రికార్డులతో సరిచూసుకోవడం మంచిదంటున్నారు.. బాధితులు. మరీ ముఖ్యంగా స్థానికంగా నివాసం లేని యజమానులు, ఏళ్ల తరబడి వ్యవసాయం చేయకుండా ఖాళీగా వదిలేసిన, మరీ ముఖ్యంగా విలువైన భూమి యజమానులు చూసుకుంటే మరీ ముఖ్యమని రెవెన్యూ సిబ్బంది సూచిస్తున్నారు.

ఉదాహరణలివీ..!

- మదనపల్లెకు చెందిన పాలూరు దేవదానం, ఆయన అన్న కుమారుడు జనార్ధన్‌రావు ఇద్దరికీ సైనిక ఉద్యోగుల కోటా కింది కురబలకోట మండలం ముదివేడు రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్388-3ఏలో 3.75 ఎకరాలు, అదే రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 388-3బీలో 3.45 ఎకరాల భూమిని పట్టా ఇచ్చారు. 1969లో ప్రభుత్వం వీరికి మిలటరీ పట్టా జారీ చేసింది. 2023 జూలై వరకూ వరకూ మాజీ సైనికులు దేవదానం, జనార్ధన్‌రావు పేర్లతో అడంగల్, వన్‌బీ రికార్డులు ఉన్నాయి. కాగా, కడప-బెంగళూరు జాతీయ రహదారి పక్కన ముదివేడు వద్ద ఉన్న ఈ విలువైన భూమి కొన్నేళ్లుగా బీడుగా ఉంది. అంతే ఈ భూమిపై వైసీపీ నేతల కన్నుపడింది. వీరి పేరు మీదున్న భూమి మరొకరి పేరు మీద మారిపోయింది. చిత్తూరులోని వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి బంధువుల పేరుతో ఆన్‌లైన్‌లో రెవెన్యూ రికార్డులు మార్చేశారు. రోజుల వ్యవధిలోనే రికార్డులు మారిపోయాయి. ఆలస్యంగా చూసుకున్న బాధితులు లబోదిమంటూ రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. ఈ భూమిని మీరు ఎప్పుడో అమ్మేశారనే సమాధానం వారి నుంచి వచ్చింది. తీరా లోతుగా రికార్డులను పరిశీలిస్తే నకిలీ సంతకాలు, బోగస్ రికార్డులు, ఫ్యామిలీ సర్టిఫికెట్లతో మార్చేశారు. చిత్తూరులో ఉన్న వీరిని ముదివేడులో ఉన్నట్లు ఫ్యామిలీ ధ్రువపత్రం సృష్టించి రికార్డులు మార్చేశారు. ఇందులో వీఆర్వో నుంచి రెవెన్యూ అధికారుల వరకు లక్షల రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు. అనంతరం బాధితులు అటు నాయకులు, ఇటు అధికారులను అన్యాయం అంటూ వేడుకున్నా న్యాయం జరగలేదు. చివరకు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. బాధితులిద్దరూ మదనపల్లెలో గుర్తింపు పొందిన జాషువా శ్రీనివాస్‌రావు కుటుంబీకులు. ఆయన మదనపల్లె మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కూడా.
- కురబలకోట మండలం ముదివేడుకు చెందిన సయ్యద్ జాఫర్‌కు కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం ముదివేడు రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-442-1లో 3.90 ఎకరాలు డీకేటీ పట్టా మంజూరు చేసింది. ముదివేడు మోడల్ స్కూల్ పక్కన, జగనన్న కాలనీ హైవే పక్కన ఉంది. జాఫర్ మరణాంతరం భార్య సయ్యద్ మహబూబ్‌బీ పేరున రికార్డు మారింది. ఈ క్రమంలో ఆ భూమిని వీరి కుమారులు ఎస్.ఖాదర్‌వలి, ఎస్.సయ్యద్‌గౌస్‌లకు 1.95 ఎకరాల చొప్పున వచ్చింది. ఇందులో మొదటి కుమారుడు ఎస్.ఖాదర్‌వలి ఉద్యోగరీత్యా చిత్తూరులో స్థిరపడిపోగా, ఆయన తమ్ముడు భూమిని సాగు చేసుకుంటున్నారు. ఎస్.ఖాదర్‌వలి భార్య ఎస్.రమీజాబీ పేరున ఉన్న వన్‌బీ రికార్డును తిరిగి ఆమె అత్త మహబూబ్‌బీ పేరున మార్పు చేసి రమీజాబీ పేరును ఆన్‌లైన్‌లో హోల్డ్‌లో పెట్టారు. పేరు ఈమెదే కనిపిస్తున్నా ఆధార్, ఫోన్ నెంబర్‌ను మరొకరికి లింకు చేసి భూమి ఇతరులకు అమ్మేశారు. విషయం తెలుసుకున్న బాధితురాలు రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే అమ్మేయడానికి ప్లాన్ చేసినట్లు తెలుసుకున్నారు. ఇదంతా స్థానికంగా ఉన్న ఓ వైసీపీ నాయకుడు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఆలస్యంగా కనుకున్న బాధితురాలు ఎస్.రమీజాబీ స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కేంద్రంలోని స్పందనకు వెళ్లి అర్జీలు అందచేశారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా బాధితురాలికి ఇప్పటికీ న్యాయం జరగలేదు.
- కురబలకోట మండలం కంటేవారిపల్లెకు చెందిన వెంకటమ్మకు గ్రామ సమీపంలోని కురబలకోట రెవెన్యూ గ్రామంలో 5.10 ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆమె పేరుతో ప్రభుత్వం పట్టా జారీ చేసింది. అప్పటి నుంచి పంటలు సాగు చేసుకుంటున్న వెంకటమ్మ భూమిని స్థానిక వైసీపీ నాయకుల జోక్యంతో రెవెన్యూ అధికారులు జబివుల్లా పేరుతో మార్చేశారు. ఆసల్యంగా గుర్తించిన బాధితురాలు లబోదిమంటూ రోడ్డెక్కారు. తర్వాత స్థానిక నేతలను ఆశ్రయించి అధికారులపై ఒత్తిడి తేవడంతో పొరపాటు పేరుతో దరఖాస్తు చేసించి తిరిగి బాధితురాలి పేరున వన్‌బీ చేశారు.
- అదే మండలం కంటేవారిపల్లెకు చెందిన ఓ రైతు భూమిని కూడా ఇలాగే మార్చేశారు. అనంతపురం-మదనపల్లె జాతీయ రహదారికి సమీపంలోని కురబలకోట రెవెన్యూ గ్రామంలో ఆ రైతుకు 1.25 ఎకరాలు డీకేటీ పట్టా భూమి ఉంది. ఆయన కూడా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే తనకు రావాల్సిన ప్రైవేటు డెయిరీ పాలబిల్లు వివిధ కారణాలతో ఆగిపోయింది. అప్పుడు భూమికి సంబంధించిన వన్‌బీ అవసరం కావడంతో సచివాలయానికి వెళ్లి వన్‌బీ తీసుకుంటే వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో భూమిని మార్చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే, మీ భూమికి సంబంధించిన పత్రాలు తేవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. తనకు పిత్రార్జితంగా వస్తున్న భూమి ఉన్నట్లుండి మారిపోవడంపై బాధితుడు ఆందోళనకు గురయ్యాడు. పత్రాలు చేతపట్టుకుని బాధితుడు అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారుల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చింది. న్యాయస్థానానికి వెళ్తానని చెప్పడం, చివరకు పోలీసులను ఆశ్రయించడంతో ఎట్టకేలకు తనపై భూమి హక్కులు మార్చేశారు. ఇవి మచ్చుకు మాత్రమే .వెలుగులోకి రాని బాధితులు ఎందరో ఉన్నారు. తంబళ్లపల్లె వైసీపీ పెద్దల ఏలుబడిలో ఆ పార్టీ నాయకులు, వారి పేరుతో దళారులు చేస్తున్న ఇలాంటి దారుణాలే తార్కాణంగా చెప్పవచ్చు. భూహక్కు చట్టం-23 అమలులోకి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే..ఇక ఆ చట్టం అమలులోకి వచ్చి వైసీపీ నేతల చుట్టం అయితే ఇక ఎలా ఉంటుందోనని రైతులు, సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కంటేవారిపల్లె సమీపంలో ప్లాట్లుగా మారిన అసైన్‌మెంట్ భూమి

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, మే 19: సంతాన లక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకంతో అభిషేకించి అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్

రాయచోటి టౌన్, మే 19: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ అధికారులకు సూచించారు. ఆదివారం ఎస్పీ కృష్ణారావుతో కలిసి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని, ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బారికేడింగ్ పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బందోబస్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ సరళి సజావుగా జరిగేందుకు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఆశాజనకంగా టమోటా ధరలు

- కిలో టమోటా ధర రూ.32

గుర్రంకొండ, మే 19: టమోటా ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా టమోటా ధరలు పతనమై రైతులు నష్టాలను చవిచూశారు. బయట రాష్ట్రాలు, చుట్టుపక్కల జిల్లాల్లో టమోటా పంట దిగుబడి తగ్గింది. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. ఈక్రమంలో రెండు రోజులుగా టమోటా ధరలు ఆశాజనకంగా పెరిగాయి. ఇందులో భాగంగా గుర్రంకొండ మార్కెట్ యార్డులో కిలో టమోటా ధర రూ.32కు చేరుకుంది. ఈ లెక్కన 25 కిలోల క్రేట్ ధర రూ.800 వరకు పలికింది. టమోటా ధరలు పుంజుకోవడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరిస్తోంది.



మీకెంత ధైర్యం.. మా వాళ్లను స్టేషనుకు పిలిపిస్తారా

- సీఐ శ్రీకాంత్‌ను బెదిరించిన ఎమ్మెల్యే రాచమల్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు మునిరెడ్డి
- విధులకు ఆటంకం కలిగించడంపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, మే 19: మీకు ఎంత ధైర్యం ఉంటే.. నా మనుషులను స్టేషనుకు పిలిపిస్తారు.. అంటూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. శనివారం ఉదయం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనపై సీఐ శ్రీకాంత్ యాదవ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే, వైస్ చైర్మన్‌తో పాటు వారి అనుచరులు కుండా రవి, ద్వార్శల గురునాథరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..

ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని శనివారం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు కౌన్సెలింగ్ చేపట్టారు. ఇందులో భాగంగా వన్‌టౌన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను పోలీసుస్టేషనకు పిలిపించి సీఐ శ్రీకాంత్‌యాదవ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రామేశ్వరానికి చెందిన మార్తల నవీన్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆ ప్రాంతంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన వ్యక్తులను దూషిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అతడిని స్టేషనుకు సీఐ పిలిపించారు. ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని కౌన్సెలింగ్ ఇస్తుండగా.. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే రాచమల్లు, బంగారు మునిరెడ్డిలు వారి అనుచరులు కుండా రవి, ద్వార్శల గురునాథరెడ్డిలతో పోలీసుస్టేషనుకు వచ్చారు. మీకు ఎంత ధైర్యం ఉంటే నా కార్యకర్తలను స్టేషనుకు పిలిపిస్తారు అంటూ సీఐని బెదిరించి.. విధులకు ఆటంకం కలిగిస్తూ.. నవీన్‌కుమార్‌రెడ్డిని బలవంతంగా స్టేషను నుంచి తమ వెంట తీసుకెళ్లారు. జరిగిన ఘటనపై సీఐ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసులు నమోదు చేశామని, తదుపరి విచారణ జరుగుతుందని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ప్రొద్దుటూరులో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించమని, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నమో నారసింహా..

- రేపటి నుంచి భువనగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- 24న కల్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ కమిటీ సభ్యులు



భువనగిరి లక్ష్మీనృసింహస్వామి గుట్ట

రాజంపేట, మే 19: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజంపేట మండల పరిధిలోని భువనగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రోజైన కల్యాణ మహోత్సవానికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది భక్తులతో పాటు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు. రాజంపేట పట్టణానికి సమీపంలో గల భువనగిరిపల్లెలో కొండపై ప్రతిష్ఠించబడిన లక్ష్మీనృసింహస్వామి భక్తులకు వరముల ప్రసాదించే స్వామిగా ఎంతో ప్రసిద్ధి చెందారు. దాదాపు 300 సంవత్సరాల కిందట కొండపై ఓ వేప చెట్టు కింద ఉన్న స్వామి వారి పాదాలకు ఓ సాదువు వచ్చి పూజలు నిర్వహిస్తుండేవారు. కొండ కింద గల భువనగిరిపల్లె ప్రజలు పశువులు మేపేందుకు కొండపైకి వెళ్లగా అక్కడ ఉన్న సాధువు వారిని పిలిచి ఇక్కడ మహావిష్ణువు స్వరూపుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి పాదాలు ఉన్నాయని, ఇక్కడ మీరు పూజలు చేస్తే మీరు కోరుకున్న కోర్కెలు తీరుస్తాడని ఆ సాధువు ప్రజలకు వివరించారు. తాళ్లపాక అన్నమాచార్యులు తన అవ్వగారి ఊరైన ఊటుకూరుకు సమీపంలో గల భువనగిరి కొండపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని, స్వామి వారిని కీర్తిస్తూ కొన్ని కీర్తనలను రాశాడని తెలుస్తోంది.

బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన అంశాలు

21 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 21న మంగళవారం ధ్వజారోహనం, 22న హనుమద్వాహనం, 23న గరుడసేవ, 24న ఉదయం 9.26 గంటలకు మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు పసుపులేటి వీరప్రదీప్‌కుమార్, పవన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అదేరోజు గజవాహన సేవ ఉంటుంది. 25న వసంతోత్సవం, ఏకాంత సేవ, ధ్వజారోహణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.



లక్ష్మీనృసింహస్వామి వారి పాదాలు

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి భువనగిరిపల్లె గ్రామస్తులు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు పూల హరిప్రసాద్, కావేరిగారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, కంబాయిగారి సుబ్బనరసింహులు, మన్నేరు లక్ష్మీనరసయ్య, కొమ్మూరు సుబ్బనరసయ్యల ఆధ్వర్యంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ప్రధానంగా కల్యాణోత్సవం రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను పూర్తి చేసినట్లు వారు తెలిపారు.



భువనగిరి లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్



భువనగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పులివెందుల సరస్వతీ విద్యామందిరంలో పూర్వపు విద్యార్థులు

పులివెందుల టౌన్, మే 19: సరస్వతి విద్యామందిరం పాఠశాల 1999-2000 బ్యాచ్ విద్యార్థులు కలిశారు. ఆదివారం జరిగిన ఈ సమ్మేళనంలో 24ఏళ్ల తర్వాత అంతా కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. అందరు కలిసి విందులో పాల్గొన్నారు.

రెండు షాపుల్లో రూ.70 వేలు చోరీ



దుకాణాల్లో దొంగలు చోరీ చేస్తున్న దృశ్యం

రామాపురం, మే19: మూడు రోడ్ల కూడలిలో ఉన్న రెండు దుకాణాల తాళాలు పగులగొట్టి నగదు అపహరించుకు వెళ్లినట్లు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జరిగిన చోరీపై పోలీసుల కథనం మేరకు.. రామాపురం పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో లక్కిరెడ్డిపల్లె క్రాస్ రోడ్డులో ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ గంప వెంకట్రమణ మందుల షాపు, బాదుల్లా బేకరీ తాళాలను దుండగులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ రెండు దుకాణాల్లో దాదాపు రూ.70 వేల వరకు నగదు చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ దుర్మరణం

బి.కొత్తకోట, మే19: విద్యుదాఘాతంతో రామకృష్ణ(45) దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... పీటీఎం మండలం కాయలవాండ్లపల్లెకు వాసి రామకృష్ణ డిష్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కాగా ఓబిరెడ్డిగారిపల్లెలో డిష్ వైర్లు రిపేరు చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టింది. రామకృష్ణ అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

శాశ్వత జీఓ వచ్చేనా ?

రైతన్నల సమస్యలు పరిష్కారమయ్యేనా? ● చుక్కనీరు లేని పోరుమామిళ్ల చెరువు
నేతల మాటలు నేతిబీరకాయేనా? ● అధ్వాన్నంగా మారిన చెరువుకట్ట


ఎడారిని తలపిస్తున్న పోరుమామిళ్ల చెరువు

పోరుమామిళ్ల, మే 19: చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన పోరుమామిళ్ల చెరువుకు తెలుగుగంగ ద్వారా పూర్తిస్థాయిలో నీరందించి ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉండేలా ప్రత్యేక జీఓ తెస్తామన్న నేతల మాటలు నీటిమూటలవుతున్నాయి. ఐదేళ్లకోమారు వచ్చే ఎన్నికల సమయాల్లో నేతల నోట ఇదే ప్రచారాస్త్రం. తీరా ఓట్లు దండుకున్నాక దాని ఊసే ఎత్తకుండా నాయకులు వ్యవహరిస్తుంటారు. రైతన్నలు తమ ఆశలు అడియాశలేనా, అంటూ అయోమయంలో పడిపోతున్నారు. వివరాల్లోకెళితే....

బద్వేలు నియోజకవర్గంలో పోరుమామిళ్ల చెరువుకు ఎంతో చరిత్ర ఉంది. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత పోరుమామిళ్ల చెరువును పూర్తి రిజర్వాయరుగా మార్చి 0.75 టీఎంసీల నీరు నిల్వ ఉంచి పోరుమామిళ్ల ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని ఐదేళ్లకోసారి చెబుతున్న హామీలు ఆచరణ శూన్య మే. ఏప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా ఈ ప్రాంత ఎమ్మెల్యే ఎవరున్నా ప్రతిసారి నేతలు చెప్పే మాట పోరు మామిళ్ల చెరువును ఆధునీకరించి నీరు బ్రహ్మంసాగర్ ద్వారా నిల్వ ఉంచేలా శాశ్వత జీఓ తెస్తామని ఈ విషయం సీఎం దృష్టికి తెస్తామని ఎన్నో సార్లు వారు చెప్పిన మాటలు నీటిమూటలవుతున్నాయి. పోరుమామిళ్ల చెరువుకు సంబంధించి సాధారణ ఆయకట్టు అధికారికంగా 4వేలు ఉన్నా అనధికారికంగా ఈ చెరువుపై ఆధారపడి దాదాపు పదివేల ఎకరాల్లో రైతులు రబీ, ఖరీఫ్ పంటలను పండించేవారు. కొన్నిసార్లు వర్షాభావ పరిస్థితులు అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు నష్టపోయిన దాఖలాలు ఉన్నాయి. బ్రహ్మంసాగర్ నీరు పోరుమామిళ్ల చెరువు ద్వారా బద్వేలు వరకు ఉన్న చెరువులన్నీ నింపే అవకాశాలు కల్పించారే కానీ శాశ్వతంగా ఈ చెరువును ఆధునీకరించి నిల్వ ఉంచుదామనే దృఢమైన సంకల్పం పాలకుల్లో లేకుండాపోయింది. దీంతో అన్నదాతల ఆశలు అడి యాశలయ్యాయి. ఇటీవల ఎన్నడూలేని విధంగా పోరుమామిళ్ల మండలంలో చెరువులన్నీ ఎండిపోయి చుక్క నీరు లేకుండా పోయింది. పోరుమామిళ్ల, రంగసముద్రం సహా మిగిలిన గ్రామీణ ప్రాంత చెరువులు కూడా దాదాపు చుక్క నీరు లేని పరిస్థితి. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వ్యవసాయ బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడింది. చాలా మంది రైతుల్లో తమ పంటలను నష్ట పోయారు. మునల్ రెడ్డిపల్లె ప్రాంతంలో దాదాపు 40 ఎకరాల వరకు పత్తి పైరు నీరందక ఎండు దశకు చేరిందని రైతులు వాపోతున్నారు. పోరుమామిళ్ల చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయని, వ్యవసాయ బోర్లు కూడా రీచార్జి అయ్యే అవకాశాలు ఉండేవని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ చెరువులో చుక్క నీరు లేకపోవడంతో దుక్కులు దున్ని ఖరీఫ్‌కు పంటలు సాగు చేసుకోవడానికి కూడా రైతులు ముందుకు రావాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెరువుకట్ట 1వ తూము నుంచి రెండో తూము వరకు కట్టకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి కట్ట బలహీనపడుతుంది. సంబంధిత అధికారులు చెరువుకట్టపై ఉన్న కంపను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోరుమామిళ్ల రైతాంగం సమస్యలు పూర్తిగా తీరాలంటే పోరుమామిళ్ల చెరువుకు శాశ్వత జీఓ తెచ్చి చెరువును ఆధునీకరించి ఫుల్ రిజర్వాయరుగా చేస్తే తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదు. అంతేకాక పోరుమామిళ్ల నుంచి బద్వేలుకు కాల్వల ద్వారా గంగ నీరు వెళుతున్నా ఎత్తైన ప్రదేశమైన సిద్దవరం తదితర ప్రాంతాలకు నీరు వెళ్లలేని పరిస్థితి. ఆ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అయినా ఏర్పాటు చేస్తే గంగనీరు అందని రైతుల పొలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అయినా నీరందే అవకాశాలున్నాయని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక అయినా నేతలు రైతుల మీద కనికరం చూపి శాశ్వత జీఓ తెచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.


చెరువుకట్ట పై కమ్ముకున్న కంపచెట్లు

రిజర్వాయరైతే రైతాంగం సమస్య తీరుతుంది

20 ఏళ్లుగా పాలకులు ఎవరున్నా ముఖ్యమంత్రుల వద్దకు వెళ్లి శాశ్వత జీఓ తెస్తామని చెబుతున్నారే కానీ కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. పోరుమామిళ్ల చెరువుకు శాశ్వత జీఓ వస్తే 0.75 టీఎంసీల నీరు నిల్వ ఉం టుంది. దీంతో సాగునీటికి నీరందడమే కాకుండా వ్యవసాయ బోర్లు కూడా రీచార్జి అయ్యే అవకాశా లుంటాయి. ఇప్పటికైనా పాలకులు ఈ శాశ్వత జీఓ మీద దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కనుమర్లపూటి రామసుబ్బారావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు

వేడుకగా పెంచలోరి ఉత్సవాలు ప్రారంభం

గోనుపల్లి నుంచి ఊరేగింపుగా కోనకు ఉత్సవమూర్తుల రాక ● గిరిజనవాడల్లో అంబరాన్నంటిన సంబరాలు
వైభవంగా అంకురార్పణ ● వేడుకగా స్వామివారికి శేషవాహన సేవ




గోనుపల్లి - కోనకు పల్లకీలో బయలు దేరిన స్వామి, దేవేరులు - గోనుపల్లిలో అత్తవారింట పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు - కోనలో స్వామి దేవేరుల ఊరేగింపు

రాపూరు(డక్కిలి), మే 19: రాపూరు మండలం గోనుపల్లి, గోనుపల్లి గిరిజనవాడలు ఆదివారం ఉదయం గోవింద నామస్మరణతో మార్మోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల మధ్య ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి బ్రహ్మోత్సవాలు చేసుకునేందుకు గోనుపల్లిలోని అత్తారింటి నుంచి పెంచలకోనకు పయనమయ్యారు. గ్రామంలోని పెంచలోరి ఆలయం నుంచి పల్లకీలో చెంచులక్ష్మి అమ్మవారి ఇంటికి చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గోనుపల్లి గిరిజనవాడలో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నార మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజన వాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పందిళ్లు వేసి, ఇంటి ముంగిట రంగవళ్లులు తీర్చిదిద్ది వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకున్న వరుడిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ముత్తైదువులు గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేక పూల అలంకరణతో పల్లకీలో దేవేరులతో కలిసి స్వామివారు శివారుల్లోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని గొల్లబోయికి తొలిదర్శనం ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకీ మోసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు గోనుపల్లిలో బయలుదేరిన స్వామివారు మధ్యాహ్నం 12 గంటలకు కోనకు చేరకున్నారు. కార్యక్రమం లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే ఐదురోజులు కూడా గోనుపల్లి వాసులు నియమ, నిష్ఠలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా కోనకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.


కోనలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా అంకురార్పణ

కోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార పండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి నిత్య హోమాలను ప్రారంభించారు. అర్చకులు పుట్ట మన్నును తీసుకువచ్చి, అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా విజయవంతంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. తదుపరి శేషవాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● కుమారుడికి తీవ్ర గాయాలు


మహబూబ్‌జాన్ మృతదేహం ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో

రామాపురం, మే19: స్కూటర్‌ను కారు ఢీకొనడంతో షేక్. మహబూబ్ జాన్ (47) మృతి చెందగా, ఆమె కుమారుడు ఎస్. మహమ్మద్ అలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి కథనం మేరకు రామాపురం మండలం గువ్వలచెరువు వాసులు షేక్. మహబూబ్‌జాన్, ఆమె కుమారుడు షేక్. మహమ్మద్ అలీ పెళ్లి పత్రికలు పంచేందుకు రాయచోటికి వెళ్తుండగా ఆదర్శ పాఠశాల వద్ద సెల్ పాయింట్ భాస్కర్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మహమ్మద్‌అలీకి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు వెళ్లిపోతుండగా, పోలీసులు వెంబడించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గోపవరం, మే 19: రాచాయిపేట సచివాలయం సమీపంలో 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం చోటు చేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే.... రాచాయిపేట సచివాలయం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు బద్వేలు రూరల్ పోలీసులకు సమా చారం అందించారు. కాగా మృతుడు బ్లూ కలర్ టీ షర్టు, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమా ర్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హార్సిలీ హిల్స్ ఘాట్‌లో తప్పిన ప్రమాదం


హార్సిలీహిల్స్‌లో బ్రేక్ ఫెయిల్ అయిన బస్సు

బి.కొత్తకోట,మే19: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం నుంచి 40 మంది పర్యాటకుల బృందం విహారయాత్రలో భాగంగా హార్సిలీహిల్స్‌కు ఓ బస్సులో వచ్చారు. పర్యాటక ప్రదేశాలు అన్నీ కలియ తిరిగి, సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు ఘాట్‌రోడ్డు మూడో మలుపు వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పింది. దీంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును లోయలోనికి పోనివ్వకుండా ఓ బండరాయికి ఢీకొట్టాడు. ప్రయాణికులంతా ఏమి జరుగుతోందో తెలియక హాహాకారాలు పెట్టారు. ప్రమాదం నుంచి బయటపడ్డామని తెలుసుకుని ఉపశమనం పొందారు. ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి




మునిగణేష్, పెంచలయ్య మృతదేహాలు

రైల్వేకోడూరు(రూరల్) మే 19: కుక్కలదొడ్డి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. చంద్రగిరి మండలం కొత్తపేట వాసి మునిగణేష్(24) బైకుపై కోడూరు జాతరకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిఅక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో మైసూరివారిపల్లి హరిజనవాడకు చెందిన చలమాల పెంచలయ్య(40) ఎస్.ఉప్పరపల్లెలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ప్రధాన రహదారి వద్ద తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆయన అక్కడి అక్కడే మృతి చెందాడు. మృతదేహాలను కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ తెలిపారు.

ఇప్పట్లో మోక్షం రాదా?

సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి అందని ద్రాక్ష ● తరచూ ఇబ్బందులు పడుతున్న ప్రజలు


వంతెనకు నోచుకోని సగిలేరు నది

కాశినాయన మే 19: ఉప్పలూరు ప్రజలకు సగిలేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు అందని ద్రాక్షలా మారింది. సగిలేటికి వరదలు వచ్చిన ప్రతిసారి పాత, కొత్త ఉప్పలూరు వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుంటారు. దాదాపు 200 కుటుంబాలున్న ఈరెండు గ్రామాలు సగిలేరు నదికి అత్యంత సమీపంలో ఉన్నాయి. సగిలేరుకు ఇరువైపులా వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉండడంతో ప్రజలు నది దాటి అటూ ఇటూ రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. సగిలేరుకు ఎగువ ప్రాంతం నుంచి సీజన్‌లో వచ్చే వరదల మూలంగా వారాల తరబడి నదిలో రాకపోకలు నిలిచి వ్యవసాయానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటలు చేతికి వచ్చేసమయంలో సగిలేరుకు వరదలు వస్తే ఆరైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. కనీసం పొలం వద్దకు వెళ్లి వస్తామన్నా రైతులు నదిదాటుకోలేని పరిస్థితి. గ్రామానికి పడమరవైపు ఉప్పాగు, తూర్పు, ఉత్తరం వైపుల సగిలేరు నది గ్రామాలను చుట్టేసినట్లు ఉంటుంది. సగిలేరు కు వరదలు వచ్చిన ప్రతిసారీ మండల కేంద్రమైన నర్సాపు రం సహా చుట్టుపక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతా యి. 1996, 1998లల్లో ఎగువనున్న నంద్యాల, నల్లమల అడవి, గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాల మూలంగా పైభాగంలో ఉన్న అనేక చెరువులు, కుంటలు తెగి సగిలేటికి భారీగా వరదలు వచ్చాయి. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలకు రోజుల తరబడి కంటిమీద కునుకులేకుండా చేశాయి. ప్రజలు ఇళ్లను ఖాళీచేసి పశువులు సహా సమీప మిట్టప్రాంతానికి వెళ్లారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉండి ఉంటుందో ఇట్టే అర్థమవుతోంది. నాటి నుంచి సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలనే డిమాండ్ గ్రామస్థుల నుంచి బలంగా వినిపిస్తోంది. సమస్య తీవ్రతను గుర్తించిన గ్రామస్తులు వంతెన ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలిజేశామంటున్నారు. దశాబ్దాలు గడిచిపోతున్నా అదినేటికీ కార్యరూపం దాల్చకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈరెండు గ్రామాలను కలుపుతూ సగిలేరు మీదుగా తెల్లబాడు క్రాస్ రోడ్డునుంచి పిట్టిగుంట బస్టాప్ వరకు దాదాపు 8కి.మీ మేర కొత్తగా తారురోడ్డు నిర్మించారు. సగిలేరులో బ్రిడ్జి నిర్మించకుండా తారు రోడ్డు వేసినా పెద్దగా పైగ్రామాలవారికి ప్రయోజనం ఉండదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సగిలేరుపై వంతెన నిర్మాణ జరిగేలా అధికారులు తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జనజీవనం స్తంభిస్తోంది




సగిలేరుకు వరదలు వచ్చిన ప్రతిసారి జనజీవనం స్తంభిం చిపోతోంది. అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వరద ఉధృతి తగ్గినా పెద్ద పెద్ద గుండాలు ఏర్పడడంతో నది దాటుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. రెండేళ్లగా అదోబ్రిడ్జి ఇదో బ్రిడ్జి అంటున్నారేగానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు

ముత్తుముల పీరారెడ్డి, పాత ఉప్పలూరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సగిలేరునదిపై రూ.10.21 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి మంజూరైంది. ఇప్పటికే ఉన్నతాధికారులతో కలిసి పలుమార్లు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తిచేశాం. పేపర్ వర్క్ నడుస్తోంది. పనులు త్వరలో మొదలు పెట్టిస్తాం.

అమర్‌నాథ్, పీఆర్ డీఈ



WANTED

కడప నగరంలో ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు క్యాషియర్-02, క్యాప్టెన్స్-02, కిచెన్ సూపర్‌వైజర్స్-02 (Experience / Freshers) All Post Experience People are preferable, Cont: 90525 10778

Ajc-188570

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను

కడపలో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. Q : 5th - 10th P/Fail. డ్యూటి : 12 గంటలు, జీతం : 12,000/- సంప్ర : 97035 08754, 70950 04007

Ajc-188758

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 176998

EDUCATION

విజయవాడలో B.P.T, B.Sc., MLT (ల్యాబ్ టెక్నీషియన్), DMLT, అనస్తీషియా, కార్డియాక్ కేర్, ఆపరేషన్ థియేటర్, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులు. అర్హత : ఇంటర్. SC / ST / BC స్కాలర్ షిప్ / ఫ్రీ సీట్లు కలవు. సంప్ర : 79959 45835

AJB - 182326

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య



రాయచోటి: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు



రాజంపేట: పుచ్చలపల్లె సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు రవికుమార్



గాలివీడులో సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

రాయచోటిటౌన్, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, సీపీయం నాయకులు మాధవయ్య మాట్లాడుతూ ఎగువ గొట్టివీడుకు చెందిన నాగరాజు ఆర్థిక సహకారంతో 100 మంది రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశామని తెలిపారు. నిజాయితీకి మారుపేరుగా ఉదహరించే మహానాయకుల్లో సుందరయ్య ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఈయూ నాయకులు ఆదిలక్ష్మి, సులోచన, అంజి, హర్ష, చెన్నయ్య, అంజి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ నేతగా పేరు గాంచారని సీఐటీయూ వీఆర్‌ఏల సంఘం జిల్లా కార్యదర్శి భోగేశ్వరయ్య కొనియాడారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకుడైన పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర్య సమరయోధుడని, దక్షిణ భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అని వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథి అని కొనియాడారు. ప్రజల కోసం తన ఆస్తినంతటిని పార్టీకి, ప్రజలకు పంపిణీ చేసిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. నిజాయితీకి మారుపేరు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.రవికుమార్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణంలో ఎంతో కీలక పాత్ర పోషించి కుల వ్యవస్థ నిర్మూలనకు ఎంతో కృషి చేసి పేదవర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శజీవితాన్ని గడిపిన మహానాయకుడు సుందరయ్య అన్నారు. ఆయన అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి అయినా తన పేరులోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్న గొప్ప నాయకుడన్నారు. స్వాతంత్ర్య సమరం లోనూ, అనేక ఉద్యమాల్లోనూ ప్రజారాజ్యం వంటి పుస్తకాల రచనల్లోనూ ఆయన చేసిన సేవ ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు లక్ష్మీ, ఈశ్వరమ్మ, నరసింహ, లక్ష్మీదేవి, ప్రసాద్, సురేష్, సాయి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె, మే 19 : చిన్న ఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు మే 20 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియం ఉన్నాయన్నారు. పదో తరగతి , కులం, ఆదాయ సర్టిఫికెట్‌లు జత చేసి కళాశాలలో ఇవ్వాలన్నారు. మే31 లోగా మొదటి దశలో అడ్మిషన్‌లు తీసుకున్న వారికి జూన్ 1 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. సెకండియర్‌లో అత్యున్నత ఫలితాలతో పాటు, పీడీ శారద శిక్షణలో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎన్నిక అయ్యారన్నారు. అడ్మిషన్‌కు 9494849331, 9440747334 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రాయచోటి ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, మే19: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మద్దిరేవుల ఈడిగపల్లెకు చెందిన ఎలక్ట్రీషియన్ వెంకట్రమణ కుటుంబానికి ఆదివారం రాయచోటి ప్రైవేటు ఎలక్ట్రికల్స్ అసోసియేషన్ రూ.28,700 అందజేసింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్. అస్లాం మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల ఈడిగపల్లెకు చెందిన ఎలక్ట్రీషియన్ వెంకట్రమణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. దీంతో అతని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి షాజహాన్, లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జి బాబు, భాస్కర్, ఉపకోశాధికారి శ్రీనివాసులరెడ్డి, రహంతుల్లా, సయ్యద్ బాషా, ఓబులేసు, దుర్గా తదితరులు ఎలక్ట్రీషియన్ సోదరులు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దు : సీఐ

రాయచోటిటౌన్, మే19: బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఈసీ ఆదేశించినట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహనాల్లో మాత్రమే ఇందనం నింపాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఈసీ హెచ్చరించిందన్నారు. ఈ మేరకు అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపిందన్నారు. పోలింగ్ తర్వాత ఏపీలో పలుచోట్ల హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఈసీ ఆ ఆంక్షలు విధించిందన్నారు. ఈసీ ఆంక్షలను రాయచోటి పట్టణంతో పాటు మండలంలోని పెట్రోల్ బంకు నిర్వాహకులు తప్పకుండా పాటించాలని సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మకు పొంగుబాలు



గంగమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చిట్వేలి, మే 19: గ్రామదేవత గంగమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగుబాలు నిర్వహించారు. ఏటేటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతరను ఈ ఏడాది చేయలేని కారణంగా గ్రామ పెద్దలు పొంగుబాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ముద్దలు పెట్టుకుని అమ్మవారికి బలులు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

- జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాయచోటిటౌన్, మే19: ఎయిడ్స్ వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దామని ఎయిడ్స్ వ్యాధితో జీవిస్తున్న ప్రజలకు సాయం చేసిన వారిని గుర్తిద్దామని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం రాయచోటిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి డైట్ కళాశాల వరకు ప్రేమ, సంఘీభావంతో మనందరం గుర్తుంచుకుందాం. మనందరం నయం చేసుకుందాం అనే థీమ్‌తో దీపపు వెలుగుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతో మంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం, హెచ్‌ఐవీతో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలను గుర్తించడం కోసం, సమాజంలో హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మోమోరియల్ డే నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఏఆర్‌టీ కేంద్రంలో గత 20 ఏళ్లలో సుమారుగా ఒక లక్షా 40 వేల మంది మరణించారని, ప్రస్తుతం సుమారు 2,22,300 మంది మందులు వాడుతూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. వీరికి వైద్య చికిత్స, ఔషధాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, క్షయ వ్యాధి నివారణ విభాగపు సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

26 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, మే19: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 36 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. 70 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 36 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, అప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

సుండుపల్లె, మే 19: ఈ నెల 21వ తేదీ నుంచి లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బేరిపల్లె సమీపంలో నిర్మించిన శ్రీ మహాలక్ష్మి సమేత నరసింహస్వామి దేవస్థానంలో 21వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్య క్రమానికి మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు



రామాపురం గ్రంథాలయంలో పుస్తక పఠనంలో విద్యార్థులు



గ్రంథాలయంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

రామాపురం, మే19: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయాల్లో మ్యాగజైన్లు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానాన్ని పెంపొందిం చుకోవచ్చునన్నారు. క్యారమ్ బోర్డు, చెస్ అందుబాటులో ఉన్నా యని తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణ తరగతులకు మంచి స్పందన వస్తున్నదని, ప్రతి రోజు విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి తమ విలువైన సమయాన్ని పుస్తకాలకు కేటాయిస్తున్నారన్నారు.

రైల్వేకోడూరు: విజ్ఞానం పొందాలంటే పిల్లలు గ్రంథాల యం రావాలని ప్రభుత్వ జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు గ్రంథాల యంలో అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విజ్ఞానం కలగాలంటే గ్రంథాలయాలకు వచ్చి అక్కడ ఉన్న పుస్తకాలను చదవాలన్నారు.

22 నుంచి కాలభైరవస్వామి తిరుణాల





భైరవగుట్టపై వెలసిన ఆలయం, డ్రైఫ్రూట్స్ అలంకరణలో కాలభైరవస్వామి

రాయచోటిటౌన్, మే 19: మండల పరిధిలోని ముసలిరెడ్డిగారిపల్లె సమీపంలో భైరవ గుట్టపై వెలసిన కాలభైరవస్వామి తిరుణాల ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది.. ఆ రోజు ఉదయం గణపతిపూజ, గోపూజ, అభిషేకాలు, కలశారాధన, ఉదయం 8 గంటలకు రుద్రహోమం, సాయంత్రం అభిషేకాలు, మహా మంగళహారతి ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 23న ఉదయం 6 గంటలకు గణపతిపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు మాసగాని కిరణ్ ఆధ్వర్యంలో అన్నదానం, రాత్రి 9 గంటలకు చాందినీ బండ్లు తిరుగుతాయి మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి దాతృత్వంతో నెల్లూరుకు చెందిన మాధవ ఈవెంట్స్ ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. 24వ తేదీన మైల తిరుణాల ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 21న గాలివీడు సమీపంలో గండిమడుగులో స్వామి వారికి అభిషేకాలు ఉంటాయన్నారు.

నాగారపమ్మకు పూజలు బోనాలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, మే 19: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాలేపాటి సందీప్ నాయుడు కుటుంబ సభ్యులు బోనాలు సమర్పించి, అన్నదానం చేశారు.

అంగరంగ వైభవంగా ఆకేపాడు మారమ్మ జాతర



మారమ్మ ఊరేగింపులో ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, రంగారెడ్డి



మారమ్మ ఆలయం వద్ద భక్తులు

రాజంపేట, మే 19: ఆకేపాడు మజరా లచ్చయ్యగారిపల్లెలో రెండు రోజులుగా మారమ్మ జాతర నిర్వహించారు. రాజంపేట మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగా రెడ్డి, ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి (మురళి) ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. చుట్టుపక్కల పది గ్రామాల్లో మారమ్మ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మారమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రెండు రోజులుగా చెక్కభజన, పండరి భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యనిర్వాహకులు ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో ఎల్లమ్మకు 200 సంవత్సరాల క్రితం జాతర నిర్వహించేవారని, ఆ తరువాత కొన్ని కారణాల వల్ల అవి జరగలేదన్నారు. ఇటీవలనే ఆలయాన్ని పునరుద్ధరించి గ్రామస్థుల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహించామన్నారు

గాయపడిన వ్యక్తికి ప్రసాద్‌బాబు పరామర్శ



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ప్రసాద్‌బాబు

వీరబల్లి, మే 19: మండల పరిధిలోని మట్లి పెద్దూరుకు చెందిన శ్రీరాములు ఆదివారం ప్రమాదవశాత్తు స్కూటర్‌పై నుంచి పడి గాయపడి రాయచోటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

మదనపల్లె అర్బన్, మే 19: మండలంలోని సీటీఎంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రథాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగారు. సీటీఎం, సీటీఎం క్రాస్, దబ్బిగానిపల్లె, కొత్తవారిపల్లె, పోతబోలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. గ్రామవీధుల్లో మహిళలు కర్పూర హారతులు సమర్పించారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం

మదనపల్లె అర్బన్, మే 19: మండలంలోని చిట్టిఅన్నవరంలో సత్య నారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం సత్యనారాయణ స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయంలో సత్యనారాయణ, రమాదేవిల కల్యాణం కన్నుల విందుగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్ల కల్యాణోత్సవంలో పాల్గొని కన్నులారా తిలకించారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కల్యాణం తరువాత ప్రత్యేక వాహనంలో చిప్పిలి గ్రామంలో స్వామివారిని ఊరేగించారు. గ్రామంలో ప్రజలు స్వామివార్లకు ప్రత్యేకంగా కర్పూర హారతులు పట్టారు. పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు బోనాలు





పోలేరమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు, పోలేరమ్మకు మూలవిరాట్

సంబేపల్లె, మే 19: దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లిలో ఆదివారం పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవిక సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మేకపోతులు, కోడిపుంజులు అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఏడాది వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, మరుసటి రోజు పోలేరమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తారు. పాడి పంటలు చక్కగా పండి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలంటూ పూజ నిర్వహిస్తారు. పల్లెలో మహిళలు బోనం వెనుక బోనంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందు బాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 | ప్రొద్దుటూరు : 9985921354, | పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 | మైదుకూరు : 7989603861 | రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411183 | బద్వేలు : 9985921375 | కోడూరు : 9985411183.

మాధవరంలో పారిశుధ్యం అధ్వానం



చెత్తా చెదారంతో దర్శనమిస్తున్న మురుగు కాలువ

సిద్దవటం, మే 19 : మండలంలోని మాధవరంలో కడప-చెన్నై రహదారి పక్కన మురికి కాలువలో చెత్త చెదారం పేరుకు పోయి విపరీతంగా కంపు కొడుతోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు, టిఫిన్ దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువ శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి నరసయ్యను వివరణ కోరగా వర్షపు నీరు వెళ్లేందుకు నేషనల్ హైవే పక్కన కాలువలు తీస్తుండగా మహబూబ్‌నగర్ ప్రాంతం వద్ద కొంతమంది అడ్డగించడంతో మురుగు నిలిచిపోయిందన్నారు. త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మల్లాలమ్మకు పూజలు

పెద్దమండ్యం, మే 19: మండలంలోని రెక్కలకొండ గ్రామ దేవత మల్లాలమ్మను ఆదివారం మణికంఠ స్వామి వివిధ పుష్పాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల అమర్‌నాథ్, ఆలయ ఛైర్మెన్ పుల్లారెడ్డి, పూజారి గోవిందు, గొర్ల ఉదయ్‌కుమార్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు, జ్యోతుల సమర్పణ

ములకలచెరువు, మే 19: మండలంలోని బురకాయలకోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరుణాల శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం మహా అభిషేకం, కూష్మాండ బలి, పారాయణము, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు, జ్యోతులు పెద్ద ఎత్తునసమర్పించారు. పిండి దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు నిర్వహించిన పండరి భజనలు, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో బురకాయలకోట, మద్దినాయనిపల్లె, వేపూరికోట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సిట్ విచారణ వేగవంతం

- హింసాత్మక ఘటనలు, కేసుల సమాచారం సేకరణ
- సంబంధిత వ్యక్తుల నుంచీ వివరాల నమోదు



వైసీపీ దాడిలో తగిలిన గాయాన్ని చూపిస్తున్న కూచివారిపల్లివాసి

తిరుపతి(నేరవిభాగం)/చంద్రగిరి, మే 19 : పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక సంఘటనలపై ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం జిల్లాలో ఆదివారం పర్యటించి విచారణ చేపట్టింది.అదే రోజు రాత్రికే ప్రాథమిక నివేదికను సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐజీ వినుత్ బ్రిజ్‌లాల్‌కు సమర్పించింది. ఆయా ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్‌ఐఆర్‌లలో పలు లోపాలను గుర్తించి, దానికి బాధ్యులైన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిఫారసు చేసినట్టు తెలిసింది.

శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న సిట్ సభ్యులైన డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ మార్గమధ్యం లోనే మహిళా వర్శిటీ, కూచువారి పల్లెల్లో జరిగిన ఘటనలకు సంబంధించి వివిధ మార్గాల్లో వీలైన మేరకు సమాచారం సేకరించారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ మరునాడు 14వ తేదీన పద్మావతీ మహిళా వర్శిటీలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై టీడీపీ వర్గీయుల దాడి చేసి ధ్వంసం చేయడం వంటి ఘటనలకు సంబంధించిన కేసుల ఎఫ్‌ఐఆర్‌లు పరిశీలించారు.ఆ స్టేషన్ సీఐ మురళీ మోహన్ నుంచీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఐఆర్ల ప్రతులు, సీసీ ఫుటేజీలు, ఫొటోలతో కూడిన పెన్ డ్రైవ్‌లను సీఐ మురళీమోహన్ సిట్ బృందానికి అందజేశారు. అనంతరం మహిళా వర్శిటీలో నానీపై దాడి జరిగిన ప్రాంతాన్ని, టీడీపీ వర్గీయులు ఆందోళన చేసి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. అక్కడినుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు చంద్రగిరి మండలం కూచివారిపల్లికి చేరుకున్నారు.చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ రామయ్యలతో కలసి పోలింగ్ రోజు రాత్రి హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాలను చూశారు. టీడీపీ వర్గీయులు తగులబెట్టిన వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని, కారును పరిశీలించారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ రోజు రాత్రి ఏం జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు.



మహిళా వర్శిటీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి ఫొటోలను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచారి

టీడీపీ ఏజెంటును కొట్టినందునే గొడవ

పోలింగ్ రోజు వికలాంగునితో ఓటు వేయించేందుకు యత్నించిన టీడీపీ ఏజెంట్ మురళీధర్‌ను రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేసి కొట్టారని కూచివారిపల్లి గ్రామస్తులు ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రావడంతో ఆ పార్టీ సర్పంచ్ రామిరెడ్డిపల్లి నుంచీ 200 మందిని రప్పించి తమపై దాడి చేయించారని ఆరోపించారు. పలువురు తమ గాయాలను కూడా చూపించారు. తాము టీడీపీ మద్దతుదారులమని, అందుకే తమపై దాడి చేశారని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపై కేసులు పెట్టారని, తిరుపతిలో డాక్టర్‌గా పనిచేస్తూ సోమవారం నైట్ డ్యూటీలో వున్నప్పటికీ కేసులు పెట్టించారని గ్రామ మాజీ సర్పంచ్ కవిత చెప్పారు. పెద్దఎత్తున ఘర్షణ జరిగిందని, ఆ కారణంగా సర్పంచ్ ఇల్లు, కారు ఎవరు తగులబెట్టారో, మరో కారు ఎవరు ధ్వంసం చేశారో గుర్తించలేకపోయామని గ్రామస్తులు వివరించారు. జరిగిన ఘటనలపై ఆధారాలుంటే ఇవ్వాలని డీఎస్పీ రవిమనోహరాచారి గ్రామస్తులకు సూచించారు.అనంతరం సిట్ అధికారులు పొరుగునే వున్న రామిరెడ్డిపల్లి గ్రామానికి 1.05 గంటలకు వెళ్ళి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కారు డ్రైవర్ ఈశ్వరయ్యను విచారించారు. అతడి నుంచీ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. తాను, మోహిత్ రెడ్డి కారులో వస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని వెంటనే కారు తాళాలు, ఐడీ కార్డులు, లైసెన్సు లాక్కొన్నారని ఈశ్వరయ్య సిట్ బృందానికి వివరించారు. దాదాపు 30 నిమిషాల పాటు గ్రామంలోని పలువురిని సిట్ బృందం విచారించింది.

ఎఫ్‌ఐఆర్‌లలో లోపాల గుర్తింపు... కొందరిపై చర్యలకు సిఫారసు

కూచివారిపల్లిలో పోలింగ్ రోజు రాత్రి జరిగిన ఘర్షణలు, మరుసటి రోజు మహిళా విశ్వవిద్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం, తదనంతర ఉద్రిక్తతలకు సంబంధించి నమోదైన ఎఫ్‌ఐఆర్‌లలో పలు లోపాలను సిట్ బృందం గుర్తించినట్టు సమాచారం. అలాగే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ, హింసాత్మక ఘటనలు జరిగాక వాటిని



కూచివారిపల్లిలో దహనమైన ఇంటి పరిశీలన

నియంత్రించడం లోనూ, కేసుల నమోదులోనూ బాధ్యతా రహితంగా వ్యవహరించిన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిట్ బృందం సిఫారసు చేసినట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతితో ఈ రెండు ఘటనలపై మరింత లోతుగా విచారణ జరపాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. సుమారు 70-80మందిని విచారించాల్సి వుందని, ఘటనల పూర్వాపరాలను బట్టి పోలీసు అధికారులు ఏయే సందర్భాలలో ఏ స్థాయిలో విఫలమయ్యారన్నది అంచనా వేయడానికి వీలవుతుందని వారు భావిస్తున్నట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతిస్తే ఆ మేరకు విచారణ లోతుగా కొనసాగనుంది.

పోలీసు అధికారుల్లో లోపించిన పారదర్శకత

పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ముఖ్యంగా కూచివారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు వాస్తవంగా ఏం జరిగింది? ఆ రోజు రాత్రి కూచివారిపల్లిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరు? అన్న విషయాలు పోలీసు అధికారులు ఇంతవరకూ వెల్లడించలేదు. అలాగే పోలింగ్ మరుసటి రోజు మహిళా వర్శిటీ వద్ద నానీపై హత్యాయత్నం జరిగిన సందర్భంలో ఆయన గన్‌మ్యాన్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు దాడికి యత్నించిన వైసీపీ వ్యక్తులు గాయపడిన విషయం కూడా పోలీసు అధికారులు వెల్లడించలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ వ్యక్తుల్లో ఇద్దరు గన్‌మ్యాన్ కాల్పుల్లో గాయపడ్డారని గానీ, వారి వివరాలు గానీ వెల్లడించలేదు. అలాగే నానీపై హత్యాయత్నం తర్వాత టీడీపీ వర్గీయులు వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగినపుడు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిపై దాడి జరిగినట్టు తెలిపే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దానిపై కూడా పోలీసు అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. కనీసం దాడి జరిగిందా లేదా అన్నది కూడా స్పష్టత ఇవ్వడం లేదు. చిన్నపాటి కేసులపై కూడా ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివరాలు వెల్లడించే అధికారులు ఇంత తీవ్ర ఘటనలు జరిగినపుడు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఎవరి ఆదేశాలతో ఈ విషయాలను గోప్యంగా వుంచారు? ఎందుకోసం అలా చేశారు? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచీ సమాధానాలు లేవు. ఈ అంశాలపై సిట్ అధికారులు ఎంత వరకూ దృష్టి సారించారో, ఏ మేరకు వివరాలు సేకరించి నివేదికలో పొందుపరిచారో తేలాల్సి వుంది.

పక్కా ప్రణాళికతోనే హత్యాయత్నం!

- పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం
- ఎమ్మెల్యే చెవిరెడ్డి, కుటుంబీకుల కాల్ డేటా పరిశీలించండి!
- సిట్ అధికారులకు పులివర్తి నానీ ఫిర్యాదు

పక్కా ప్రణాళికతోనే, ఉద్దేశపూర్వకంగా తనపై హత్యాయత్నం జరిగిందని తిరుపతి జిల్లా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఈసీ నియమించిన సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని యూనివర్శిటీ పోలీస్ స్టేషన్ వద్ద సిట్ అధికారులను నానీ కలిశారు. హత్యాయత్నం ఘటనతో పాటు కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణల గురించి కూడా నానీని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ తనను అంతమొందించేందుకు పక్కా ప్రణాళికతోనే దాడి చేయించారన్నారు.దీనికి సంబంధించి కేసులో నిందితులుగా నమోదైన భానుకుమార్‌రెడ్డి, గణపతి రెడ్డి కేవలం పాత్రధారులేనని, తెర వెనుక వున్న అసలైన దోషులను గుర్తించాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి, వైసీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డిల నడుమ జరిగిన ఫోన్ సంభాషణలను బయట పెట్టాలని, దానికోసం వారి కాల్ డేటాను పరిశీలించాలని కోరారు. వారిని అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లేదంటే కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశముందన్నారు. అలాగే తనపై హత్యాయత్నానికి సంబంధించి పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం వుందన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే తనపై దాడి జరిగిన తర్వాత 40 నిమిషాల పాటు పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకోలేదని సిట్ అధికారులకు చెప్పారు. దాడి గురించి వారికి సమాచారం ఇచ్చినా కూడా స్పందించలేదన్నారు. దీనిపై కూడా లోతుగా విచారించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా పోలింగ్ రోజు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులే పలుచోట్ల టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపించారు. తన స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వైసీపీ అభ్యర్థి 17 వాహనాల్లో అనుచరులను తీసుకెళ్ళి గ్రామస్తులను రెచ్చగొట్టారని చెప్పారు. అక్కడి నుంచీ కాశిపెంట్ల, కూచివారిపల్లెలకు వెళ్ళి అక్కడా ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యారని వివరించారు. పులివర్తివారిపల్లి, కాశిపెంట్ల, కూచివారిపల్లి గ్రామాల్లో వారి తీరును విచారించాలని కోరారు. కూచివారిపల్లిలో ఒకే ఘటనపై వైసీపీ అభ్యర్థి మోహిత్ తన కారు డ్రైవరుతోనూ, తన పీఆర్వోతోనూ వేర్వేరుగా ఫిర్యాదులు చేయించి రెండు కేసులు నమోదు చేయించారని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో సంబంధం లేని వారిని నిందితులుగా చేరుస్తున్నారని వివరించారు. కేసుతో సంబంధం లేని వారి పేర్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా పులివర్తి నానీ సిట్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.



సిట్ డీఎస్పీ రవిమనోహరాచారికి తనపై దాడి జరిగిన తీరును వివరిస్తున్న పులివర్తి నాని

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు హామీ



మహిళా వర్శిటీలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), మే 19: కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గట్టి చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు.జిల్లా ఎస్పీగా ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతికి రావడం సంతోషంగా వుందన్నారు.అయితే ప్రస్తుత పరిణామాల నడుమ బాధ్యతలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నది అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా పని చేసి అధిగమిస్తానని చెప్పారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని చెప్పారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మహిళా వర్శిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు.సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేసి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతను పరిశీలించారు.

కోనకు చేరిన పెంచల స్వామి

- నృసింహుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





గోనుపల్లి నుంచి కోనకు బయలుదేరిన శ్రీవారి పల్లకీని మోస్తున్న భక్తులు - అలంకరణలో నృసింహ స్వామి

డక్కిలి, మే 19: వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలంలో వున్న గోనుపల్లి, గోనుపల్లి గిరిజన వాడలు ఆదివారం గోవింద నామ స్మరణతో మార్మోగాయి. ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం పెంచలకోనకు బయల్దేరారు. గోనుపల్లిలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మీ దేవి ఇంటికి చేరుకొన్నారు. కొత్తల్లుడి రాకతో గోనుపల్లి గిరిజన వాడ జనం తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజన వాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పచ్చటి పందిళ్ళు, ఇండ్ల ముంగిట రంగవల్లులు వేసి వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరిన వరుడు నరసింహస్వామిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను పొలిమేర వరకు సాగనంపారు. పూలతో అలంకరించిన పల్లకీలో దేవేరులతో కలిసి కొలువు దీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకొని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయీలు పల్లకీ మోసుకొంటూ 6 కిలో మీటర్లు కాలినడకన పెంచల కోనకు పయనమయ్యారు.సహజసిద్ధమైన ప్రకృతి అందాల నడుమ వందలాది భక్తుల మధ్య స్వామివారు కోనకు చేరుకున్నారు. ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుపుకొని తిరిగి స్వామి వారు ఈ నెల 25వ తేదీన గోనుపల్లికి చేరుకొంటారు. కాగా, పెంచలకోనలోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

రామకుప్పం, మే 19: రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ ఆనిగానూరులో శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని బల్ల పంచాయతీ పెద్దకురబలపల్లెకు చెందిన వెంకటేశ్(40) తోపుడు బండిలో కూరగాయలు తీసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం రాత్రి యథాప్రకారం ఆనిగానూరు గ్రామంలో వ్యాపారం ముగించుకుని, స్వగ్రామానికి పయనమయ్యాడు. ఆదే సమయంలో విజలాపురం నుంచి కుప్పం వెళ్తున్న ఆర్టీసీ బస్సు తోపుడుబండితో బాటు వెంకటేశ్‌ను ఢీకొంది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్(ఫైల్ ఫొటో)

అత్తింటి ఆరళ్లకు వివాహిత బలి

- బావిలో దూకి ఆత్మహత్య

రామకుప్పం, మే 19: రామకుప్పం మండలం బల్ల పంచాయతీ లక్ష్మీనగర్‌లో అత్తింటి ఆరళ్లను భరించలేక ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం పెద్దవంకకు చెందిన కనకరాజు, కస్తూరి దంపతుల కుమార్తె సుమిత్ర(24)కు, రామకుప్పం మండలం లక్ష్మీనగర్‌కు చెందిన చిన్నతంబి, సంపూర్ణ దంపతుల కుమారుడు పెరుమాళ్(26)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల కొంతకాలంగా భర్త, అత్త సూటిపోటి మాటలతో ఆమెను వేధించే వారు. తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈ నెల 16న పెరుమాళ్, సుమిత్ర తమిళనాడు సరిహద్దు గ్రామంలో బంధువుల ఇంట జరిగిన ఓ వేడుకకు వెళ్లారు. అక్కడ కూడా వారు గొడవ పడ్డారు. 17న ఇంటికి చేరుకోగా.. అదే రోజు మధ్యాహ్నం పెరుమాళ్ బెంగళూరుకు పయనమయ్యాడు. సాయంత్రం పశవులకు గడ్డి వేసిన తర్వాత సుమిత్ర కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లి తన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో సుమిత్ర శవమై కనిపించింది. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో వెళ్లి.. మృతదేహాన్ని బయటకు తీసి కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పెరుమాళ్, చిన్నతంబి, సంపూర్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



సుమిత్ర (ఫైల్ ఫొటో)





మామిడిచెట్లను విరిచేసిన ఏనుగులు - ఏనుగుల దాడిలో దెబ్బతిన్న అరటిచెట్లు

పంటలపై ఆగని గజ దాడులు

కల్లూరు, మే 19: పులిచెర్ల మండలం చల్లావారిపల్లె, పాతపేట పంచాయతీల్లో శనివారం రాత్రి పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేశాయి. పంటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలో గతేడాది మామిడికాయల సీజన్‌లో గజ దాడులు మొదలయ్యాయి. అప్పట్లో మామిడి రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. మళ్లీ ఇదే మామిడికాయల సీజన్‌లో మండలంలో ఏనుగల గుంపు దాడులకు దిగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా అటవీప్రాంతం నుంచి పాతపేట సమీపానికి చేరుకున్న సుమారు 10 ఏనుగుల గుంపు ఘీంకారాలు చేస్తూ పంటలకు నష్టం కలిగించాయి. ఏనుగుల అరుపులతో పాతపేట ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాతపేటకు చెందిన రైతులు చిన్నరెడ్డెప్ప, బాలసుబ్రమణ్యం, గుర్రప్ప, ఈశ్వరయ్య, నాగరాజు, రమేష్‌కు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. మామిడి కాయలను ఇష్టానుసారంగా నేలరాల్చాయి. వెంకటరత్నంకు చెందిన అరటి, పశుగ్రాసంను తొక్కేశాయి. సురేష్‌కు చెందిన మల్బరీపంటను.. సుబ్రమణ్యంకు చెందిన డ్రిప్ పైపులను తొక్కి నాశనం చేశాయి. అనంతరం చల్లావారిపల్లి వైపు వెళ్లిన ఏనుగులు.. అదే గ్రామంలోని రైతు ఎస్వీ రమణకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను నేలరాల్చాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. మూడు నెలల క్రితం మండలాన్ని ఏనుగుల గుంపు వదిలి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్న రైతులకు.. మళ్లీ ఏనుగులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను నివారించాలని కోరారు.

మైనింగ్ కోసమే ఆఫ్రికాకు భారీ వాహనాలు

మంత్రి పెద్దిరెడ్డి



తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికాలో తాము నిర్వహిస్తున్న మైనింగ్ కాంట్రాక్ట్ అవసరాల కోసమే ఇండియా నుంచి పొక్లెయిన్లు, టిప్పర్లు ముంబై పోర్టునుంచి పంపుతున్నామని, టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్టు వాటిలో నగదు, బంగారు పంపించడం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు.తాము నిర్వహిస్తున్న పీఎల్ఆర్, జస్విన్ సంస్థల తరపున ఆఫ్రికాలో ఫెరో మ్యాంగనీస్, ఫెరో సిలికా మైనింగ్ కాంట్రాక్ట్ పనులు చేపట్టామన్నారు. దశలవారీగా వంద భారీ వాహనాలను, యంత్రాలను పంపుతున్నామన్నారు.దీనికే దేశాలు వదిలి పారిపోతున్నామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.పోలింగ్ శాతం పెరగడానికి కారణం మహిళలేనని, ఐప్యాక్ సర్వేలో మహిళలు తమకే ఓట్లు వేసినట్టు తేలిందన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
S.V. సినిమాస్ (అంబిక థియేటర్, చంద్రగిరి) లో పని చేయుటకు స్టాఫ్ కావలెను.
ఫోన్ : 90143 59555
AJT-3037

TO-LET
TO-LET 3BHK ... తిరుపతి Cell:9848226551.
AJT-3040

WANTED
తిరుపతిలోని తాహిర్ బిజినెస్ అండ్ ఎగ్స్ మార్ట్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన క్యాషియర్/సూపర్‌వైజర్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 99488 49820
AJT-179597

PLOTS FOR SALE
వడమాలపేట Toll Plaza దగ్గర లో East North Corner ప్లాట్ అంకణం రూ.22000లకు అమ్మబడును.
సెల్: 97001 19024
AJT-3034

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించండి: 7382114647
AJA-176998

ప్లాట్స్ ఫర్ సేల్
సేవనగర్ దగ్గర తిరుపతి IIT, IISEER దగ్గర ... అతి తక్కువ ధరకే ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు. డైరెక్ట్ ఓనర్.
95027 74175, 79959 92114
AJT-3032

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE
తిరుపతికి దగ్గర కాయంపేట వద్ద అంకణం 40000 లకు Tuda Approval Plot అమ్మబడును.
సెల్: 97001 19024
AJT-3033

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

తృటిలో తప్పిన ప్రమాదం



హార్సిలీహిల్స్‌లో బ్రేక్ ఫెయిల్ అయిన బస్సు

బి.కొత్తకోట,మే19:బి. కొత్త కోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్ లీహిల్స్ ఘాట్ రోడ్డులో ఆదివారం పెను ప్రమా దం తప్పింది. అన్నమ య్య జిల్లా చిన్నమండ్యం కు చెందిన 40 మంది పర్యాటకుల బృంధం ఆదివారం విహార యాత్రలో భాగంగా హార్సిలీహిల్స్‌కు ఓ బస్సులో వచ్చారు. పర్యాటక ప్రదేశాలు అన్నీ తిరిగి సాయంత్రం తిరుగు ప్రయా ణంలో బస్సు ఘాట్‌రోడ్డు మూ డో మలుపు వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ అయ్యి అదుపుతప్పింది. దీంతో బస్సు డ్రైవర్ చాకచక్యం గా వ్యవహరించి బస్సును లోయ లోనికి పోనియ్యకుండా ఓ బండరాయికి ఢీకొట్టాడు. ప్రయాణి కులంతా ఏమి జరుగుతోందో తెలియక హాహాకారాలు పెట్టారు. ప్రమాదం నుంచి బయటపడ్డా మని తెలుసుకుని ఉపశమనం పొందారు. ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ దుర్మరణం

బి.కొత్తకోట, మే19: విద్యుత్ షాక్ తో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. పీటీయం మండలం రాపూరివాండ్లపల్లె పంచాయతీ కాయలవాం డ్లపల్లెకు చెందిన రామకృష్ణ(45)డిష్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దైనందిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం బి.కొత్తకోట మండలంలోని ఓబిరెడ్డిగారిపల్లెలో డిష్ వైర్లు రిపేరు కు ప్రయత్నిస్తుండగా కరెంట్ షాక్ కొట్టింది. దీంతో రామకృష్ణ అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయాడు. పరిస్థితి ని గమనించిన స్థానికులు హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య స్వప్న(40), ఇంటర్ చదువుతు న్న ఓ కుమారుడు ఉన్నారు. కాగా అన్నమయ్య జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రదాన కార్యదర్శి సలీంబాషా ఈ విషయమై తీవ్ర సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.

ద్విచక్రవాహనాలను ఢీ కొన్న టిప్పర్ - ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్/కలికిరి మే 19: వేగంగా వస్తున్న టిప్పర్ రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కలికిరికి చెందిన హఫీజుల్లా(30), బురకాయ కోటకు చెందిన సాహెబ్‌పీర్(33) (ట్రాన్స్‌కో లైన్‌మెన్) కలసి వారి బంధువుల పెళ్లి పత్రికలను పంచేందుకు మదనపల్లెకు వచ్చారు. ఇక్కడ పెళ్లి పత్రికలు పంచి అదే ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో 150 మైళ్ళ వద్ద ఎదురుగా వస్తు న్న టిప్పర్ వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పాటు, వారి వెనుకే మరో ద్విచక్రవాహనంలో వస్తున్న మదనప ల్లెకు చెందిన రాజశేఖర్(58)ను కూడా ఢీ కొని నిలపకుండా వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంతో హఫీజుల్లా, సాహెబ్‌పీర్‌లకు చేయి, కాలు విరిగి, ఒక కన్ను తీవ్రంగా గాయమైంది. ఇదే ప్రమాదంలో మద నపల్లెకు చెందిన రాజశేఖర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వారి ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమిం చడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లి, మే 19: ఇంటి వద్ద పనులను పరిశీలిస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలైన సంఘటన ఆదివా రం మండలంలో చోటు చేసుకొంది. స్థానిక బస్టాండు సమీపం లో కిరాణా షాప్ నిర్వహిస్తున్న ఊకా రమేష్ (54) నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. ఈ క్రమంలో నిర్మాణంలో వున్న తన ఇంటి పై కప్పుపై పరిశీలిస్తుండగా పైన వున్న విద్యుత్ లైన్ తగిలి అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే నిమ్మనపల్లె ప్రభుత్య ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి చికి త్సలు అందించారు. ప్రస్తుతం రమేష్ కోలుకుంటున్నట్లు కుటుం బీకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలు

ములకలచెరువు, మే 19: ములకలచెరువు రైల్వేగేటు వద్ద శని వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ సచివాలయ ఇం జనీరింగ్ అసిస్టెంట్ ప్రకాష్(40) తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దతిప్పసముద్రం మండలం కాట్నగల్లు గ్రామ సచివా ల యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రకాష్ విధులు ముగించుకుని ద్విచక్రవా హనంలో వెళుతుండగా రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలయని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో అతను తీవ్రంగా గాయపడడంలో స్థానిక ప్రభు త్వాస్పత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి మా కక్షిదారుడు M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, పీలేరు వారి తరఫున తెలియచేయడం ఏమనగా క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తి అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, డోర్నంబరు 51/100లో నివసించు ఎం.నంతమ్మ W/o ఎం.హరికృష్ణ గారికి చెందినది, సదరు షెడ్యూలు ఆస్తిని ఆయకట్టు హామీగా ఉంచుకొని బుణమును మంజూరు చేయుచున్నారు. షెడ్యూలు దాఖలా ఆస్తిపై క్రయ విక్రయాలు కాని అగ్రిమెంట్లు కాని ,అప్పులు క్లైములు కాని ఆస్తిపై ఎవ్వరికైనా ఆక్షేపణలు కాని అభ్యంతర ములు కాని ఎవ్వరికైనను ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 7 దినము లలో మా కక్షిదారులకు గానీ క్రింద కనపరచిన న్యాయవాదికి కాని ఆధారములతో తెలియచేయగలరు. సదరు సమయము లోపల రాతపూర్వకమైనటువంటి ఫిర్యాదులు రాని యెడల ఎటువంటి అభ్యంతరము లేదని భావించి బుణము మంజూరు చేయుదురని తెలియ చేయడమైనది. గడువు దాటిన తరువాత వచ్చు అభ్యంతరములను పరిగణనలోకి తీసుకొనబడవు

SCHEDULE:Annamayya District (Rayachoti Sub District)- Sambepalli Mandal-Devapatla Gram Panchayat & Revenue Village-in S.No. 1160/2 an extent of Ac.0.34 cents and in that extent house bearing No:12/13,at Reddyvari palli Grama Panchayat.

ఎం.భవాని శంకర్, న్యాయవాది, పీలేరు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి మా కక్షిదారుడు M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, పీలేరు వారి తరఫున తెలియచేయడం ఏమనగా క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తి అన్నమయ్య జిల్లా, ఇందిరమ్మ కాలనీ, తరిగొండ పల్లెలో నివసించు టి.సుబ్రహ్మణ్యం S/o టి.రెడ్డెప్ప గారికి చెందినదిని, సదరు షెడ్యూలు ఆస్తిని ఆయకట్టు హామీగా ఉంచుకొని బుణమును మంజూరు చేయుచున్నారు. షెడ్యూలు దాఖలా ఆస్తిపై క్రయ విక్రయాలు కాని అగ్రిమెంట్లు కాని అప్పులు, క్లైములు కాని ఆస్తిపై ఎవ్వరికైనా ఆక్షేపణలు కాని, అభ్యంతరములు కాని ఎవ్వరికైనను ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 7 దినములలో మా కక్షిదారులకు గానీ క్రింద కనపరచిన న్యాయవాదికి కాని ఆధారములతో తెలియచేయగలరు. సదరు సమయము లోపల రాతపూర్వకమైనటువంటి ఫిర్యాదులు రాని యెడల ఎటువంటి అభ్యంతరము లేదని భావించి బుణము మంజూరు చేయుదురని తెలియచేయడమైనది. గడువు దాటిన తరువాత వచ్చు అభ్యంతరములను పరిగణనలోకి తీసుకొనబడవు

SCHEDULE :Annamayya District (erstwhile Chittoor District)-Vayalpad Sub -District Gurram konda Mandal-Tarigonda Gram Panchayathi & Revenue Village,the property situate in S.Nos.828/1 to an extent of Ac.2.68cents, S.No.828/2-Ac 1.50cents, S.No.830/2-Ac.0.53cents,in total Ac.4.71 cents in the said property Balaji Garden City Layout, bearing Plot No.13, to an extent of 1090 sq feet or 121.111 sq yards or 101.264 sq meters site pura within the following boundaries: East plot No.19, West: Vayalpad-Gurramkonda Road, North-Plot No.14, South: Plot No.12 in between the above boundaries West:54 k feet or 16.6116 meters, South:20 feet or 6.096 meters, admeasuring 1090 sq feet or 121.111 sq.yards or 101.284 sq.meters site pura

ఎం.భవాని శంకర్, న్యాయవాది, పీలేరు.

నరసింహ స్వామి జయంతి



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

సుండుపల్లె, మే 19: ఈ నెల 21వ తేదీ నుంచి లక్ష్మీ నర సింహస్వామి జ యంతి ఉత్సవాలు నిర్వహి స్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సుం డుపల్లె మండలం లోని పెద్దినేనికాలు వ గ్రా మ పంచా యతీ బేరిపల్లె సమీపంలో నిర్మిం చిన శ్రీ మహాలక్ష్మి సమేత నర సింహ స్వామి దేవస్థానం లో 21వ తేదీ ఉద యం 9 గంటల నుంచి కల్యాణం కనుల పండువగా నిర్వహి స్తామన్నా రు. పెద్ద సం ఖ్య లో భక్తులు రానున్న ట్లు తెలిపారు.

వేడుకగా అమ్మవారి జాతర్లు

● పీలేరులో ఉలవల గంగమ్మ జాతర, వాల్మీకిపురంలో నల్లవీర గంగాభవాని జాతర ● ములకలచెరువులో ముత్యాలమ్మ తిరుణాల



పీలేరులో గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ములకలచెరువులో ముత్యాలమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పీలేరు, మే 19: గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో పల్లెసీమలు కలకలలాడాలని కోరుకుంటూ అమ్మవార్లకు జాతర్లు చేస్తారు. ఇందులో భాగంగానే ఈ ఆదివారం పలుల మండలా ల్లో అమ్మవార్లకు ప్రత్యేకంగా జాతర్లు నిర్వహించారు. పీలేరు-తలపుల మార్గంలోని ఉలవల గంగమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే జాతరలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం ఆలయ పూజారి ప్రకాశ్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వెంకటరమణ నాయుడు భక్తుల సమక్షంలో నిర్వహించారు. అప్పటికే అమ్మవారికి బోనాలు సమర్పించుకునేందుకు తలపుల, మేళ్లచెరువు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో జాతర కోలాహలం మొదలైంది. అమ్మవారి దర్శనంతోపాటు జాతర సందర్భంగా మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ములకలచెరువులో వైభవంగా ముత్యాలమ్మ తిరుణాల

ములకలచెరువు, మే 19: మండలంలోని బురకాయలకోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి తిరుణాల ఉత్సవాలు వైభవంగా ప్రా రంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం మహా భిషేకము, కూష్మాండబలి, కుంకమార్చన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా బోనాలు, జ్యోతులు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. పిండి దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కళాకా రులు నిర్వహించిన పండరి భజనలు, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో బురకాయలకోట, మద్దినా యనిపల్లె, వేపూరికోట గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా నల్లవీర గంగాభవానీ జాతర

వాల్మీకిపురం, మే 19: వాల్మీకిపురం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపం లో వెలసిన నల్లవీర గంగాభవానీ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం చాటింపుతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆల యంలో మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు జల కళశాలతో పట్టణ పురవీధు లలో ప్రదర్శనగా వెళ్లి స్థానిక బజారు వీధి, నాయక్‌వీధులలో గల గం గరాళ్లకు జలాభిషేకాలు నిర్వహించి పూజలు చేస్తూ మొక్కులు తీర్చు కున్నారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ రామ్‌కుమార్‌రెడ్డి, అర్చకు లు జనార్ధన్‌స్వామి, విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు ఆనందశెట్టి, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

పెద్దమండ్యం, మే 19: మండలంలోని సి.గొల్లపల్లె పంచాయతీ రెక్కల కొండలో ప్రసిద్ధి చెందిన రెక్కలకొండ గ్రామ దేవత మల్లాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కి పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ పుష్పాలతో అలం కరించా రు. అనంతరం అన్నదానం చేశారు. గర్భాలయాన్ని రెక్కలకొండపల్లెకు చెందిన గొర్ల చంద్రశేఖర్ కుటుంబసభ్యులు నూతనంగా ఏర్పాటు చేశా రు. స్థానిక సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల అమర్‌నాథ్, ఆల య ఛైర్మన్ పుల్లారెడ్డి, పూజారి గోవిందు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సాధుచెట్టి సంఘం జాతర వేడుకలు

బి.కొత్తకోట, మే19: బి.కొత్తకోట పట్టణంలో సాధుచెట్టి సంఘం జాతర వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. మూడురోజుల పాటు ఈ వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని జను పువీధిలో ఉన్న గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు విచిత్ర వేషధారణలలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద తీర్థ ప్రసాదాలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.



వాల్మీకిపురంలో జలకళశాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు



బి.కొత్తకోటలో విచిత్ర వేషధారణలో సాధుచెట్టి సంఘం భక్తులు

భారంగా మారనున్న పశుపోషణ

● ట్రాక్టర్ వరిగడ్డి రూ. 15 వేలు ● పశుగ్రాసం కొనాలంటే కష్టమంటున్న పాడిరైతులు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డి

మదనపల్లె అర్బన్, మే 19: వేసవి కాలం కావడంతో పశుగ్రాస కొరత పాడిరైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో పశుపోషణ భారంగా మారుతోందంటూ పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. మదనపల్లె మండలంలో 70శాతం రైతాంగం పాడిపశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పశుగ్రాసం కొనుగోలుపై రైతులు చాలా కష్టాలు ఎదు ర్కొంటున్నారు. మండలంలో వరిసాగు తక్కువగా ఉండడంతోపాటు పండినపంటలు చేతికి అందకపోవడంతో శ్రీకాళ హస్తి, ఏర్పేడు, కదిరి ప్రాంతాల నుంచి రైతులు పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. అయితే ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ15 వేలు పలుకుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాడిపోషణకు ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు ప్రవేశపెట్టినా అవి సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో పాడిరైతులకు పశుపోషణ భారంగా మారింది. పాడిపశువుల పాలధర రూ. 30 ఉండడం, అదే సమయం లో పాడిపోషణకు ఎక్కువ ఖర్చు కావడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులను అన్ని విధాల ఆదుకునేలా ప్రభుత్వం పాల కు గిట్టుబాటు ధర కల్పించాలని పాడిరైతులు కోరుతున్నారు. ప్రభు త్వం ప్రతిగ్రామంలో పశుగ్రాసం అందేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీపై వరిగడ్డి అందజేయాలి



పాడిరైతులకు వరిగడ్డి సబ్సిడీపై సరఫరా చేయాలి. పాడిపోషణ లేకపో తే రైతులు చాలా ఇబ్బందులు పడుతారు. ప్రస్తుతం పశువుల కోసం అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకతప్పడంలేదు రైతులకు. దీం తో పాలలో వచ్చే ఆదాయం పశుపోషణకే సరిపోతోంది. కావున ప్రభుత్వం సబ్సిడీపై వరిగడ్డి సరఫరా చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది

-ఎం. ప్రభాకర్, సర్పంచ్ చీకలబైలు, మదనపల్లె మండలం

రేపు కలికిరి మండల సమావేశం

కలికిరి, మే 18: కలికిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగ ళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ఎంపీ పీ నూర్జహాన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, సర్పం చులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ హాజరు కావాలని కోరారు.

కలకడలో వెలగని హైమాక్స్ లైట్లు

కలకడ, మే 19:కలకడ నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఉన్న హైమాక్స్ లైట్లు గత కొంతకాలంగా వెలగడం లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా హైవే అధికారులు వాటిని ఏర్పాటు చేయగా కొద్ది రోజులు మాత్రమే వెలిగాయని ప్రస్తుతం లైట్లు వెలుగక చీకటిగా ఉంటోంది.

వైభవంగా ఆకేపాడు మారమ్మ జాతర

రాజంపేట, మే 19: ఆకేపాడు మజరా లచ్చయ్యగారిపల్లెలో రెండు రోజులుగా మారమ్మ జాతర నిర్వహించారు. రాజంపేట మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి (మురళి) ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. చుట్టుపక్కల పది గ్రామా ల్లో మారమ్మ విగ్ర హాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మారమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆకేపాటి గోపా ల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రెండు రోజులుగా చెక్కభజన, పండరి భజన తదితర సాంస్కృతిక కార్యక్రమా లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యనిర్వాహకులు ఆకేపాటి శ్రీనివాసు లురెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో ఎల్లమ్మకు 200 సంవత్సరాల క్రితం జాతర నిర్వహించేవారని, ఆ తరువాత కొన్ని కారణాల వల్ల అవి జరగలేదన్నారు. ఇటీవలనే ఆలయాన్ని పునరుద్ధరించి గ్రామస్తుల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహించామన్నారు

నాగారపమ్మకు పూజలు బోనాలు

సుండుపల్లె, మే 19: మండ లంలోని పెద్దినేనికాలువ గ్రా మ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలసిన నాగారప మ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి పట్టు వ స్త్రాలను సమర్పించారు. మం డలంతో పాటు రాయచోటి, పీ లేరు, రాజంపేట వంటి ప్రాం తాలకు చెందిన భక్తులు బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాలేపాటి సందీప్ నాయుడు కుటుంబ సభ్యులు బోనాలు సమర్పించి, అన్నదానం చేశారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మకు పొంగుబాలు

చిట్వేలి, మే 19: గ్రామదేవత గంగమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగుబాలు నిర్వహించారు. ఏటేటా ఆన వాయితీగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతరను ఈ ఏడాది చేయలేని కారణంగా గ్రామ పెద్దలు పొంగుబాలు కార్య క్రమాన్ని నిర్వహించారు. భక్తులు ముద్దలు పెట్టుకుని అమ్మవారికి బలులు సమర్పించారు. చుట్టుపక్కల గ్రా మాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు

రామాపురం, మే19: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయా ల్లో మ్యాగజైన్లు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నా యన్నారు. జూన్ 7వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణ తరగతు లకు మంచి స్పందన వస్తున్నదన్నారు.

రైల్వేకోడూరు: విజ్ఞానం పొందాలంటే పిల్లలు గ్రంథాల యం రావాలని ప్రభుత్వ జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు మురళీకృష్ణ తెలిపారు. ఆది వారం రైల్వేకోడూరు గ్రంథాల యంలో అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారు ్థలకు మంచి విజ్ఞానం కలగాలంటే గ్రంథాలయాలకు వచ్చి అక్కడ ఉన్న పుస్తకాలను చదవాలన్నారు.

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దు : సీఐ

రాయచోటిటౌన్, మే19: బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఈసీ ఆదేశించినట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహనాల్లో మాత్రమే ఇందనం నింపాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఈసీ హెచ్చరించిందన్నారు. ఈ మేరకు అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపిందన్నారు. పోలింగ్ తర్వాత ఏపీలో పలుచోట్ల హింసాత్మక ఘర్షణలు చోటు చేసు కున్న నేపథ్యంలో ఈసీ ఆంక్షలు విధించిందన్నారు. ఈసీ ఆంక్షలను రాయ చోటి పట్టణంతో పాటు మండలంలోని పెట్రోల్ బంకు నిర్వాహకులు తప్పకుండా పాటించాననలి సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు.

36 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మే19: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయ న్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 36 మందికి కంటి ఆపరేషన్లు నిర్వ హించారు. 70 మందికి పరీ క్షలు నిర్వహించిన వైద్యులు 36 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చే యించుకున్న 35 మందికి పరీక్ష లు నిర్వహించి అద్దాలు, మందు లు పంపిణీ చేశారు. కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మా జీ ఛైర్మన్ లయన్ అన్వర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మదనపల్లె అర్బన్, మే 19: మండలంలోని చిప్పిలి గ్రామంలో చిట్టిఅన్నవరంలో సత్య నారాయణ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారా యణ స్వామివార్ల కల్యాణం అత్యంత వైభ వంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజ లు చేశారు. అనంతరం ఆలయంలో సత్య నారాయణ, రమాదేవిల కల్యాణం కన్నుల విందుగా వైభవంగా జరిపించారు. ముందుగా ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యే కంగా పూజలు నిర్వహించి అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్ల కల్యా ణోత్సవంలో పాల్గొని కన్నులారా తిలకించారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్న దానం నిర్వహించారు. సాయంత్రం చిప్పిలి గ్రామంలో సత్యనారాయణ, రమాదేవిల గ్రామోత్సవం నిర్వహించగా ప్రజలు స్వామివార్లకు కర్పూర హారతులు పట్టారు. కార్యక్ర మంలో ఆలయకమిటీ సభ్యులు కె.అమరనాథ్, వేదంరామకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

కన్నులపండువలా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



లక్ష్మీనరసంహస్వామి రథోత్సవంలో భక్తులు

మదనపల్లె అర్బన్, మే 19: మదనపల్లె మండ లం సీటీఎం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి స్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం వైభవంగా కన్నులపండువలా నిర్వహించారు. ముందుగా స్వామి వారి రథాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ రథాన్ని భక్తు లు ఉత్సాహంగా లాగారు. సీటీఎం, సీటీఎం క్రాస్, దుబ్బిగానిపల్లె, కొత్త వారిపల్లె, పోతబోలు గ్రామా ల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సీటీఎం లక్ష్మీనరసిం హ స్వామి రథోత్సవంలో పాల్గొన్నారు. గ్రామవీధుల్లో మహిళలు కర్పూరహారతులు ఇచ్చి కన్నులారా దర్శించు కున్నారు.

శయనోత్సవంతో ముగిసిన జయంత్యుత్సవాలు



శయనోత్సవంలో అమ్మవారు

మదనపల్లె అర్బన్, మే 19: కన్యకాపరమేశ్వరి జయంత్యుత్స వాల్లో భాగంగా ఆదివారం శయనోత్సవంతో వేడుకగా ఉత్సవాలు ముగిసాయి. ఆలయంలో ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకం విశేషపూజలతోపాటు ప్రత్యేక అలంకరణలు చేశారు. మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం వాసవీమాతకు మహామం గళహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయం త్రం వాసవీమాతకు శయనోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మదనపల్లె సంఘం సభ్యులు, మదనపల్లె వాసవీక్లబ్ సభ్యులు వాసవీ మహిళాసంఘం సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు ప్రోత్సాహకాలు



ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, మే 19: మండ లంలోని అంగళ్ళు సమీపంలో ని మిట్స్ ఇంజనీరింగ్ కళా శాలకు చెందిన విద్యార్థులు అధ్యాపకులకు ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థు లు, అధ్యాపకులు వెబ్ ఆఫ్ స్కో ఫ్, స్కోపస్, ఎస్‌సీఐ, ఐఈఈ ఈ తదితర పరిశోధనలను ప్రచురించడం జరిగింది. దీంతో ప్రతిభ కనబరిచిన వారికి రూ.5.30 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులను సర్టిఫికెట్లు ప్రశంశాపత్రాలను అంద జేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అధ్యాపకులను కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, తులసీరామ్‌నాయుడు, రామనాథమ్, కృష్ణారావు, శివయ్య తదితరులు అభినందించారు.

సుందరయ్య స్ఫూర్తితో సమసమాజం నిర్మిద్దాం



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె అర్బన్, మే 19: భారతకమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కార్మిక, కర్షక, పేదప్రజల ఆశాజ్యోతి, మహోన్నతవ్యక్తిగా పేరొందిన కామ్రేడ్ పుచ్చలపల్లె సుందరయ్య స్ఫూర్తితో సమసమాజం నిర్మిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లె సుం దరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సుందరయ్య జీవితం ప్రతి ఒక్క రాజకీయ నాయకుడికి ఆదర్శం అన్నారు. సుందరయ్య చూపిన బాటలో ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయ్యాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమణ రావు, నాగరాజ, రమణ, సీఐటీయూ నాయకులు నారాయణ, ఖదీర్, న్యాయవాది సోమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పులివర్తినాని త్వరగా కోలుకోవాలి



పులివర్తి నానిని పరామర్శిస్తున్న తానా సర్వీసు విభాగం సభ్యుడు లోకేశ్ కొణిదల

మదనపల్లె టౌన్, మే 19: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం ఉమ్మ డి కూటమి అభ్యర్థి పులివర్తినాని త్వరగా కోలుకోవాలని తానా సర్వీసు విభాగం సభ్యుడు లోకేశ్ కొణిదల ఆకాంక్షించారు. ఆదివారం తిరుపతిలో పులివర్తినాని నివాసానికి లోకేశ్ కొణి దల, టీడీపీ ప్రొఫెషనల్ విభాగం నాయకులతో కలసి వెళ్లి పరామర్శించా రు. ఎన్నికల మరుసటి రోజు జరిగిన దాడి విషయమై విస్మయం వ్యక్తం చేశారు. చంద్రగిరిలో వైసీపీ ఓడిపోతుందని, గ్రహించి ఇలా దాడులు చేసి కౌంటింగ్‌కు ఆటంకం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నారని లోకేశ్ ఆరోపించారు. ఆయన వెంట పెరవలి నవీన్, నిరంజన్‌నాని, రాటకొండ రాజేష్, మహేష్, గగన్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఆదరణ సామాజిక బాధ్యత



క్యాండిళ్లతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

పీలేరు, మే 19: ఎయిడ్స్ వ్యాధిగ్ర స్తులను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా పరిగణించాలని పీలే రు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్ పేర్కొన్నారు. 'కోర్' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వ ర్యంలో ఆదివా రం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాం డిల్ లైట్ స్మారక దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీని ఉద్ధేశ్యించి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్ర మత్తంగా ఉండా లన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సీహెచ్‌వో జయలక్ష్మి, 'కోర్' సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సు మలత, ఐసీటీసీ కౌన్సెలర్లు రవి, హసీనా, రాహమ్మ, తులసీ, సల్మా న్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రొవ్వోత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న వైద్య సిబ్బంది

తంబళ్లపల్లెలో: హెచ్ఐవి బారిన పడి మృతి చెందిన వారికి తంబ ళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు. ఆది వారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాం డిల్ లైట్ స్మారక దినం సంద ర్భంగా సాయంత్రం స్థానిక ప్రభు త్వాసుపత్రిలో ఐసీటీసీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌తో మరణించిన వారిని గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకట్రామయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టి బాలాజి, సీహెచ్‌సీ సిబ్బంది, కృషి సంస్థ ప్రాజెక్ట్ మేనేజరు శ్రీనివాసులు, హెచ్ఆర్‌డబ్ల్యూఎస్ సావిత్రి, రేఖ, జాబీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.